Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | ఆదివారం మే 25 2025 | సంపుటి:2 | సంచి 236 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-



## జార్ఖండ్ మరో ఎన్‌కౌంటర్

**మావోయిస్టు అగ్రనేత పప్పూ లోహరాసహా ఇద్దరు మృతి**

తెలంగాణవీణ,రాంచీ

జార్ఖండ్‌లోని లతేహార్ జిల్లాలో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, జార్ఖండ్ జన ముక్తి పరిషత్ (జెజెఎంపి) అధినేత పప్పూ లోహరాతోపాటు మరో కీలక నాయకుడు ప్రభాత్ గంజ్ మరణించారు. ఈ ఘటనలో భద్రతా దళ సిబ్బంది ఒకరు గాయపడినట్టు అధికారులు చెప్తున్నారు. -మిగతా 2 లో

## వికసిత భారత్ లక్ష్య సాధన
# మనందరి ఆశయం

**వికసిత భారత్ లక్ష్య సాధనలో మాది కీలక భూమిక**

- ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంత లక్ష్యాలు
- అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక
- అందుకు అనుగుణంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్
- నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం




తెలంగాణవీణ,న్యూఢిల్లీ,

వికసిత భారత్ లక్ష్య సాధన మనందరి ఆశయం. అందులో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని మా ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని, ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో -మిగతా 2 లో






## కేరళను తాకిన రుతుపవనాలు

- 16 ఏళ్ల తరవాత ముందే వచ్చేసిన నైరుతి
- రెండురోజుల్లో ఏపీలోకి ప్రవేశించే అవకాశం

తెలంగాణవీణ,తిరువనంతపురం

నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయి. దాదాపు ఎనిమిది రోజులు ముందుగానే కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ శనివారం తెలిపింది. 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం ఇదే మొదటిసారి. చివరిసారిగా 2009, 2001 సంవత్సరాల్లో ఇంత త్వరగా రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. -మిగతా 2 లో



## కొవిడ్ కొత్త వేరియంట్స్ కలకలం..!

**కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 లను గుర్తింపు**

తెలంగాణవీణ,న్యూఢిల్లీ,

దేశంలో కరోనా వైరస్ మరోసారి పంజా విసురుతోంది. దేశంలోని పలు రాష్ట్రాలు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. పలుచోట్ల కొవిడ్ కొత్త వేరియంట్ లను అధికారులు గుర్తిస్తున్నారు. దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న వేళ కొత్త వేరియంట్లు వెలుగుచూస్తుండటం కలకలం రేపుతోంది. భారత్‌లో కొవిడ్ కొత్త -మిగతా 2 లో




## కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవకతవకలు

- మూడు బ్యారేజీల ఫౌండేషన్‌లోనే లోపాలు
- ఇరిగేషన్ శాఖ మంత్రి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణవీణ, సూర్యాపేట,

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవకతవకలు జరిగాయని ఇరిగేషన్ శాఖ మంత్రి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బహిరంగంగా ఆరోపించారు. నిజాలు బయటపడేందుకు జస్టిస్ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు బ్యారేజీల ఫౌండేషన్‌లోనే లోపాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌లో ఇరిగేషన్ శాఖ అధికారులతో ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన -మిగతా 2 లో


## పార్టీ అధినేతకు లేఖలు రాస్తే
# తప్పేమి కాదు


**మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంది**

- అంతర్గత విషయాలు బయట మాట్లాడడం సరికాదు
- మా పార్టీలోను రేవంత్ కోవర్టులు ఉంటే ఉండొచ్చు
- కవిత లేఖపై మీడియా సమావేశంలో స్పందించిన కేటీఆర్

తెలంగాణవీణ, హైదరాబాద్,

పార్టీ అధినేతకు సూచనలు చేయాలనుకుంటే లేఖలు రాయవచ్చునని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత లేఖపై కెటిఆర్ స్పందించారు. అంతర్గతంగా మాట్లాడే అంశాలు బయట మాట్లాడటం సరికాదని, పార్టీలో అందరం కార్యకర్తలమే..ఇది అందరికీ వర్తిస్తుందని చెప్పారు. తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని, కోవర్టులు సమయం -మిగతా 2 లో





## నేడు ఎన్‌డిఎ సీఎంల తో ప్రధాని భేటీ

- భేటీకి హాజరు కానున్న డీప్యూటి సీఎంలు

తెలంగాణవీణ,న్యూఢిల్లీ,

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఎన్డీయే ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రుల కీలక సమావేశం ఆదివారంనాడు న్యూఢిల్లీలో జరుగనుంది. ఈ అత్యున్నత స్థాయి సమావేశం అశోకా హోటల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ జరుగనుంది. జాతీయ భద్రత, కౌంటర్ టెర్రరిజం, భారత బలగాలు ఇటీవల చేపట్టిన మిలటరీ యాక్షన్, అనంతర క్రమంలో ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు తదితర -మిగతా 2 లో

## కేంద్ర,రాష్ట్రాలు టీమ్ ఇండియాలాగా పనిచేయాలి

**మన అభివృద్ధి వేగాన్ని మరింత పెంచాలి**

- నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని మోడీ
- సీఎంలతో పిచ్చాపాటిగా చాయ్ కబుర్లు

తెలంగాణవీణ,న్యూఢిల్లీ,

కేంద్రం, రాష్ట్రాలు టీమ్ ఇండియాలాగా కలిసి పనిచేస్తే.. ఏ లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని ప్రధాని మోడీ అన్నారు. ఢిల్లీలో మోడీ అధ్యక్షతన శనివారం నీతి అయోగ్ 10వ పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 'మనం అభివృద్ధి -మిగతా 2 లో



# వికసిత భారత్ లక్ష్య సాధన మనందరి ఆశయం.

(మొదటి పేజీ తరువాయి)

ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని సీఎం ప్రకటించారు. తెలంగాణ రైజింగ్ విజన్ లోని నాలుగు కీలక అంశాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, వరల్డ్ క్లాస్ ఇన్ఫ్రా డెవలప్మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తామన్నారు. 2047 నాటికి మన భారత దేశాన్ని సూపర్ పవర్ గా, నెంబర్ వన్ గా నిలబెట్టాలన్న మోదీ సంకల్పాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు.'వికసిత భారత్' ప్రణాళికను రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రధాని మోడీ అధ్యక్షతన 11వ నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. పహల్గాంలో మారణకాండ సృష్టించిన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించి నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. 1971లో శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వంలో పాకిస్థాన్ ను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చిన చరిత్రను గుర్తు చేశారు. తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు, ఎస్సీల ఉప వర్గీకరణకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను సిద్ధం చేసి కార్యాచరణలో పెట్టినట్లు- చెప్పారు. అభివృద్ధిలో, సంక్షేమంలో ఆయా వర్గాలకు న్యాయమైన వాటా ఇవ్వాలన్నది తమ సంకల్ప మన్నారు. అందుకే తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన చేపట్టాం. బీసీలకు విద్య, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ.. ఈ రెండు చరిత్రాత్మక నిర్ణయాలను దేశంలోనే మొట్టమొదటగా తెలంగాణ అమలు చేయడం గర్వంగా ఉందన్నారు. దేశవ్యాప్త కుల గణనకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. కులగణనలో తెలంగాణ అనుభవాలను పంచుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. 2028 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు కీలక పాత్ర ఉండేలా విధానాలు రూపొందించినట్లు- సీఎం ప్రకటించారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలు, మహిళా సంఘాలకు పాఠశాలల నిర్వహణ, శిల్పారామంలో 100 స్టాళ్లతో మహిళా బజార్ అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. సోలార్ పవర్ జనరేషన్ లోనూ భాగస్వామ్యం కల్పించి మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించే కార్యక్రమాలు అమలు చేశామన్నారు. మన దేశ భవిష్యత్తు మన యువత. తెలంగాణ రాష్ట్ర సాధనలో యువతదే కీలక పాత్ర. అందుకే యువత ఆశయాల సాధనకు అనుగుణంగా యూత్ పాలసీ అమలు చేస్తున్నాం. 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం, ప్రైవేటు-రంగంలో లక్ష ఉద్యోగాలు సృష్టించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఒకవైపు మానవ వనరులకు డిమాండ్ పెరుగుతున్నా మరోవైపు నిరుద్యోగ సమస్య నెలకొంది. నైపుణ్యాల కొరతే ఈ అంతరానికి కారణమని గుర్తించాం. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ-, స్పోర్ట్స్ యూనివర్సిటీ-, పోలీస్ స్కూల్, ఇంటిగ్రే-టె-డ్ మోడల్ స్కూల్స్, ఐటీఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరించి స్కిల్ శిక్షణ ఇస్తున్నామని సీఎం వివరించారు. తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ స్టేట్ గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, వాటికి అడ్డుకట్ట వేయటంలో139 దేశాల్లో తెలంగాణ నెంబర్-1 స్థానం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు రూ.5 లక్షల స్వయం ఉపాధి పథకాన్ని జూన్ 2 నుంచి ప్రారంభిస్తామన్నారు. దేశానికి రైతే వెన్నెముక అని, ఆ వెన్నెముక కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతుల ఆత్మహత్యలకు అప్పులే ప్రధాన కారణం. వారిని అప్పుల ఊబి నుండి బయటకు తేవడం, తిరిగి ఆ ఊబిలోకి జారిపోకుండా నిలబెట్టాలన్న లక్ష్యాలతో పని చేస్తున్నామన్నారు. తెలంగాణలో 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి వారిని రుణ విముక్తులను చేశాం. సాగు కోసం రైతు మళ్లీ అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశంతో ఎకరాకు రూ.12 వేల రైతు భరోసా సాయం చేస్తున్నాం. బియ్యానికి మద్దతు ధరకు అదనంగా క్వింటాల్ కు రూ.500 చెల్లించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తున్నాం. రైతుకు చేదోడుగా ఉండే వ్యవసాయ కూలీకి రూ.12 వేల ఆర్థిక సాయం చేస్తున్నాం. ఈ రోజు వరి ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ నెంబర్ వన్ గా ఉంది. గత ఏడాది 2.90 కోట్ల టన్నుల ఉత్పత్తిని సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచాం. ఈ నేపథ్యంలో రైతుల కోసం చేసే వ్యయాన్ని సంక్షేమ కోణంలో కాక... ఆహార సంపద సృష్టికి పెడుతున్న పెట్టుబడిగా చూడాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 2047 నాటికి ఇండస్ట్రీ, ఇన్ ఫ్రా విషయంలో అంతర్జాతీయ నగరాల సరసన తెలంగాణను నిలబెట్టే భవిష్యత్తు లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ ఎంచుకున్నట్లు చెప్పారు.ఈ లక్ష్య సాధనలో తొలి అడుగుగా.. ఏడాదిన్నర కాలంలో అమెరికా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, దావోస్ లలో పర్యటించి రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం మొత్తాన్ని మూడు జోన్లుగా విభజించి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని, తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ తెలంగాణగా విభజించి వృద్ధి సాధిస్తామన్నారు. తెలంగాణలో కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్ విభాగాల్లో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్, మెట్రో రైల్ సెకండ్ ఫేజ్, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మాన్యూఫాక్చరింగ్ హబ్, అగ్రిబేస్డ్ పరిశ్రములు ఏర్పాటు- చేస్తామన్నారు. సబర్మతీ రివర్ ఫ్రంట్, గంగా పునరుద్ధరణ ప్రాజెక్ట్ మాదిరిగా తెలంగాణలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉందని, మెట్రో సెకండ్ ఫేజ్, రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులు ప్రస్తుతం డీపీఆర్ ల స్టేజ్ లో ఉన్నాయి. రేడియల్ రోడ్ల నిర్మాణం తెలంగాణ ప్రతిపాదిత డ్రై పోర్ట్ నుండి మచిలీపట్నం పోర్టుకు ఎక్స్ ప్రెస్ హైవే నిర్మాణం తెలంగాణ అభివృద్ధిలో కీలకమవుతాయన్నారు. గుడ్ గవర్నెన్స్ తో అత్యున్నత ప్రమాణాలతో పౌర సేవలను అందిస్తామని , ఇందులో భాగంగా ఇ÷ఖఒరఉ కక్షా యాప్ ద్వారా నిర్మాణ రంగానికి వేగం పెంచినట్లు సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను డేటా సెంటర్ హబ్‌గా మార్చాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. విద్య, వైద్యంలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

# పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదు



(మొదటి పేజీ తరువాయి)

వచ్చినప్పుడు వారే బయటపడతారని పేర్కొన్నారు. అన్ని పార్టీల్లోనూ కోవర్టులు ఉంటారని, తమ పార్టీలోనూ సిఎం రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చునని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు పెట్టాం.. అసెంబ్లీలో ఓడిపోయాం.. ఎలా ముందుకు పోవాలని 17 రోజుల పాటు వేల మంది కార్యకర్తలతో చర్చించాం. ఆ ప్రాసెస్‌లో చాలా మంది డైరెక్ట్‌గా మైక్‌లో మాట్లాడిన వారు ఉన్నారు. కొంత మంది చిట్టీల మీద రాసిచ్చిన వారు ఉన్నారు. కొంత మంది కేసీఆర్‌కు ఉత్తరం అందించండి అని ఉత్తరాలు ఇచ్చిన వారు ఉన్నారు. మా పార్టీలో ప్రజాస్వామిక స్ఫూర్తి ఉంది. మా పార్టీ అధ్యక్షుడికి ఏవైనా సూచనలు చేయాలను కుంటే ఉత్తరాలు రాయొచ్చు. మా పార్టీలో డెమోక్రసీ ఉంది కాబట్టి.. సూచనలు సలహాలు చేస్తూ అధ్యక్షుడికి లిఖిత పూర్వకంగా, ఓరల్‌గా ఇవ్వొచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీలో ఏ హోదాలో ఉన్నా.. అంతర్గతంగా మాట్లాడాల్సిన విషయాలు అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటది. అధ్యక్షుడిని కలిసే అవకాశం ఉంది.. ఆఫీస్ బేరర్స్ ఉన్నారు.. వారిని కూడా కలిసే అవకాశం ఉంది. కాబట్టి కొన్ని విషయాలు అంతర్గతంగానే మాట్లాడితే బాగుంటు-ంది.. ఇది అందరికీ వర్తిస్తుంది. అన్ని పార్టీల్లో కోవర్టులు ఉంటారు.. అందులో రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చు అని కేటీఆర్ అన్నారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ అని,దెయ్యం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. హైకమాండ్ కు డబ్బులిస్తూ రేవంత్ పదవి కాపాడుకుంటున్నారని, ఇడి ఛార్జ్‌షీట్‌లో పేరున్న రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. నాడు ఓటుకు నోటు స్కామ్.. ఇది సీటుకు రూటు- స్కామ్ అని కెటిఆర్ ఎద్దేవా చేశారు. నైతికత ఉంటే ముఖ్యమంత్రి స్వచ్ఛందం గా తప్పుకోవాలని, ఆయన తప్పుకోకుంటే అధిష్టానం తొలగించాలని సూచించారు. రేవంత్ రెడ్డి మాటల మనిషి కాదని, మూటల మనిషి అని చురకలంటించారు. రేవంత్ ఢిల్లీ వెళ్లి చీకట్లో బిజెపి నేతల కాళ్లు పట్టుకుంటున్నారని, అమిత్ షాను రాత్రి కలిసిన రేవంత్ బయటికొచ్చిగట్టిగా మాట్లాడారని మండిపడ్డారు. నిందలు, దందాలు, చందాలు ఇదే రేవంత్ పని అని విమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ పై నిందలు, కాంట్రాక్టర్లతో దందాలు, ఢిల్లీకి చందాలు అని కెటిఆర్ దుయ్యబట్టారు. బిజెపి ఎంపిల భూదందాలకు సిఎం వత్తాసు పలుకుతున్నారని, బిజెపి నేతలు రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు.

# నేడు ఎన్‌డిఏ సీఎంల తో ప్రధాని భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అంశాలను ఈ సమావేశంలో చర్చించనున్నట్టు తెలుస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు ఈ సమావేశంలో పాల్గొనున్నారు. ఇండియా ఇటీవల విజయవంతంగా కౌంటర్ టెర్రర్ ఆపరేషన్ నిర్వహించడంపై కీలకంగా ఈ సమావేశం జరుగనుందని అధికార వర్గాల సమాచారం. ఆపరేషన్ సిందూర్, మిలటరీ దాడుల అనంతరం భారతదేశం తీసుకున్న విస్తృత భద్రతా వ్యూహంపై నాయకులు సమావేశంలో చర్చిస్తారని చెబుతున్నారు. జాతీయ భద్రత, -టె-ర్రరిజంపై ప్రభుత్వ వైఖరిపై ఈ సమావేశం విస్పష్టమైన సందేశం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఆయా అంశాలపై ఎన్డీయే భాగస్వాముల మధ్య పరస్పర సహకారంపై కూడా చర్చిస్తారు. కాగా, ఇప్పటికే అఖిలపక్ష ఎంపీల బృందం విదేశాల్లో పర్యటిస్తూ, ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న వైఖరిని, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఎండగడుతోంది. భారతదేశ సార్వభౌమాధికారాన్ని, భద్రతకు కట్టు-బడి ఉన్నామనే బలమైన సంకేతాలిస్తోంది. ఇదే సమయంలో దేశీయంగా కూడా జాతీయ భద్రతపై భాగస్వామ్య పక్షాలతో ఎన్డీయే సమావేశం ఏర్పాటు చేసి, ఐక్యగళం వినిపించేందుకు సిద్ధమవుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎపి నుంచి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పాల్గొంటారు.

# కేంద్ర,రాష్ట్రాలు టీమ్ ఇండియాలాగా పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వేగాన్ని పెంచాలి. కేంద్రం, అన్ని రాష్ట్రాలు కలిసి వచ్చి టీం ఇండియాలాగా కలిసి పనిచేస్తే ఏ లక్ష్యం అసాధ్యం కాదు అని చెప్పినట్లు- నీతి అయోగ్ ఎక్స్ పోస్టు ద్వారా వెల్లడించింది. వికసిత్ భారత్ 2047 థీమ్‌తో ఈ కౌన్సిల్ సమావేశం జరిగినట్లు మోడీ వెల్లడించారు. ప్రతి భారతీయుడి లక్ష్యం వికసిత్ భారత్, ప్రతి రాష్ట్రం వికసిత్ అయినప్పుడు.. భారత్ కూడా వికసిత్ అవుతుంది. ఇది 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్ష అని మోడీ అన్నారు. కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ నితిఅయోగ్ సమావేశానికి రాష్ట్రాలముఖ్యమంత్రులు, గవర్నర్లు హాజరవ్వాలి. కానీ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గతంలో లాగానే ఈ కౌన్సిల్‌కి హాజరవ్వలేదు. ఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు నీతి ఆయోగ్ కి సంబంధించి కీలక సమావేశం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశంలో 2047 వరకు అభివృద్ధి చెందిన భారతదేశ ప్రణాళికలపై చర్చించారు. ఈ సమావేశానికి ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులు కూడా హాజరయ్యారు. ప్రధాని మోడీ వారితో టీ- తాగుతూ చర్చిస్తున్న ఫొటోలు కనిపించింది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతోనూ ప్రధాని మోడీ ముచ్చటించారు. ప్రతిపక్ష ముఖ్యమంత్రులను ప్రధాని మోడీ ఆప్యాయంగా పలకరించారు. మరో ఫోటోలో ప్రధాని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులను కలిసిన దృశ్యం కనిపించింది.

# జార్ఖండ్ మరో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం లతేహార్‌లోని ఇచాబార్ అడవిలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురుకాల్పుల్లో పప్పూ లోహరా మృతి చెందాడు. ఆయనపై రూ.10 లక్షల రివార్డు ఉంది. ఇదే ఎన్‌కౌంటర్‌లో జెజెఎంపి, మావోయిస్టు కీలక నాయకుడు ప్రభాత్ గంజ్ కూడా చనిపోయాడు. ప్రభాత్ గంజ్‌పై రూ.5 లక్షల రివార్డు ఉన్నది. ఈ కాల్పుల్లో తీవ్ర గాయాలపాలైన ఇంకో మావోయిస్టు సజీవంగా పట్టుబడ్డాడు. పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోనూ మావోయిస్టులకు వ్యతిరేకంగా భద్రతా బలగాల చర్యలు కొనసాగుతున్నాయి. బీజాపూర్ జిల్లాలో 24 మంది, బస్తర్ ప్రాంతంలో 33 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని అధికారులు తెలిపారు. వీరిలో 24 మందిపై రూ.91 లక్షల రివార్డు ఉన్నదని చెప్పారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందగా, వారిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ కూడా ప్రాణాలు కోల్పోయిన సంగతి విదితమే. శుక్రవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లోనూ నలుగురు మావోయిస్టులు చనిపోయిన విషయం తెలిసిందే

# కేరళను తాకిన రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

అప్పుడు మే 23న రాష్ట్రాన్ని రుతుపవనాలు తాకాయి. ఇప్పుడు 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఇంత తొందరగా రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు వస్తాయి ఐఎండి ఇప్పటికే తెలిపింది. ఈ క్రమంలో శనివరాం ఉదయం నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని కేంద్ర వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో కేరళలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో రెండు రోజుల్లో రుతుపవనాలు విస్తరిస్తాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించనున్నాయి. 2009లో మే 23న రుతుపవనాలు ప్రవేశించాయి. మళ్లీ ఇన్నాళ్లకు త్వరగా రుతుపవనాలు వచ్చాయి. సాధారణ తేదీ కంటే 8 రోజులు ముందే రుతుపవనాలు వచ్చినట్లు- ఐఎండీ పేర్కొంది. వాస్తవంగా రోహిణి కార్తె సమయంలో ఎండలు మండిపోతుంటాయి. అలాంటిది ఈ ఏడాది ఆ పరిస్థితులు తలెత్తలేదు. ఇక రోహిణి కార్తె మే 25 ఆదివారం రానుంది. ఇది జూన్ 8 వరకు ఉంటుంది. రాహిణి కార్తె సమయంలో ఎండలు భగభగ మండిపోతాయి. తీవ్ర ఉష్ణోగ్రతతో బండరాళ్లు కూడా పగిలిపోతాయంటారు. అలాంటిది ఈ ఏడాది ఆ పరిస్థితులు కనిపించకపోవడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తొలిసారిగా 1918 మే 11న రుతుపవనాలు ప్రవేశించిన రికార్డ్ ఉంది. అలాగే రుతుపవనాలు ఆలస్యంగా వచ్చిన రికార్డు ఉంది. 1972లో జూన్ 18న రుతుపవనాలు ప్రారంభమయ్యాయి.

# కొవిడ్ కొత్త వేరియంట్స్ కలకలం..!

(మొదటి పేజీ తరువాయి)

వేరియంట్ కేసు ఏప్రిల్‌లో వెలుగుచూడగా.. ఎల్ఎఫ్.7 కు సంబంధించి నాలుగు కేసులను ఈ నెలలో గుర్తించినట్లు కన్సార్టియం తెలిపింది. ఆ కేసులు తమిళనాడు, గుజరాత్‌లో నమోదయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. మూడేళ్లలో తొలిసారి ఢిల్లీలో 23 మందికి వైరస్ సోకిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కొవిడ్ విస్తృతి నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తం చేశాయి. అయితే ప్రస్తుతం కరోనా కేసులు పెరుగుతున్నప్పటికీ వాటి తీవ్రత తక్కువేనని కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవల పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. ఇటీవల కాలంలో ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తోపాటు చైనాలోనూ కొవిడ్-19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారని వైద్య నిపుణులు వెల్లడించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవకతవకలు

(మొదటి పేజీ తరువాయి)



వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపేలా ఉన్నాయి. బెరాజీలు కూలిపోయే పరిస్థితి వస్తే ప్రభుత్వంగా విచారణ జరపాల్సిన బాధ్యత మాపై ఉంటుందని మంత్రి అన్నారు. కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘోష్ కమిషన్‌కు నోటీ-సులు అందిన తర్వాత బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు ప్రజలు ఖండిస్తున్నారని మంత్రి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే ఇంజనీర్లు ప్రాజెక్టు లోపాలను గుర్తించి, నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు. సమస్యలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన ఏర్పాటు- చేసిన కమిషన్‌ను బద్నాం చేయడం బాధాకరమన్నారు. నిర్మాణం మొదలై నెల రోజుల్లోనే ఇంజనీర్లు లోపాలు గుర్తించారు. కానీ, కమిషన్ల కోసం నాలుగేళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మంత్రి విమర్శలు గుప్పించారు. తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం జరిగి ఉంటే రైతులకు మేలు జరిగేది అన్నారు. కాళేశ్వరం నిర్మాణం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, ఇరిగేషన్ వ్యవస్థ దెబ్బతిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత సాగునీటి ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాల్సిన కాళేశ్వరం తప్పుదోవ పట్టడం బాధాకరమని అన్నారు.

తెలంగాణ వీణ

తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి

8328209811



## వైద్య విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి..



**తెలంగాణవీణ, ముంబై**
మహారాష్ట్రలోని సాంగ్లీలో దారుణం చోటుచేసుకున్నది. మత్తు మందు ఇచ్చి వైద్య విద్యార్థినిపై సహచరులే సామూహిక లైంగిక దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్ణాటకలోని బెళగావికి చెందిన బాధితురాలు (22) మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లాలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 18న రాత్రి 10 గంటల తన తోటి మెడికల్ విద్యార్థులతో కలిసి సినిమా చూడాలనుకున్నది. అయితే వారిలో ఒకరు అంతకుముందే ఆమెను తన ఫ్లాట్‌కు తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ మరో మెడికల్ స్టూడెంట్‌తోపాటు ఓ యువకుడు ఉన్నాడు. నలుగురు కలిసి మద్యం సేవించారు. మత్తులో ఆమెకు స్పైక్డ్ డ్రింక్ ఇచ్చారు. అది తాగిన తర్వాత బాధితురాలు స్పృహ కోల్పోయింది.దీంతో ఒకరి తర్వాత ఒకరు ముగ్గురు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. స్పృహలోకి వచ్చిన తర్వాత జరిగిన ఘోరాన్ని ప్రశ్నించడంతో.. ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ ఆమెను బెదిరించారు. తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు విశ్రాంబాగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో భారత న్యాయ సంహిత సెక్షన్ కింద సామూహిక లైంగికదాడి, ఇతర అభియోగాల కింద నిందితులపై కేసు నమోదుచేశారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేశారు. వారు పుణె, షోలాపూర్, సాంగ్లికి చెందినవారని, అంతా 20 నుంచి 22 ఏండ్ల లోపువారేనని పోలీసులు వెల్లడించారు. న్యాయస్థానం వారిని మే 27 వరకు పోలీసు కస్టడీకి అప్పగించిందని తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

## బ్యాక్‌లాగ్స్ ఉన్న విద్యార్థులకు ఓయూ బంపరాఫర్



**తెలంగాణవీణ, సికింద్రాబాద్,**
ఓయూలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీ.ఎస్.డబ్ల్యూ చదివి బ్యాక్‌లాగ్స్ ఉన్న విద్యార్థులకు వన్ టైం అవకాశం ఇస్తూ పరీక్షల విభాగం నిర్ణయం తీసుకుంది. 2000 నుంచి 2015 మధ్య చదివిన వారికి ఈ అవకాశం వర్తిస్తుందని కంట్రోలర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఇయర్ వైస్ స్కీమ్ కింద 2000 నుంచి 2015 మధ్య చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు.. తిరిగి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. నిర్దేశిత రుసుం చెల్లించి జూలైలో జరిగే పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపారు. విద్యార్థులు చదివిన కాలం చివరి సంవత్సరం సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.క్ లాగ్ పరీక్షలు రాసే విద్యార్థులు జూన్ 19 వరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చు. 500 ఆలస్య రుసుముతో జూన్ 20 నుంచి 24 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. ఆయా కళాశాలల నుంచి వచ్చే ఫీజులు కళాశాలల ద్వారా జూన్ 25 సాయంత్రం 5 గంటల వరకు ఓయూ పరీక్షల విభాగానికి ఆన్ లైన్ ద్వారా సమర్పించాలని కంట్రోలర్ కార్యాలయం స్పష్టం చేసింది. ఫీజు వివరాల కోసం www.osmania.ac.in లో చూడవచ్చు.

## భారత్‌లో చొరబాటుకు పాకిస్థానీ యత్నం..

### కాల్చిచంపిన భద్రతా బలగాలు



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**
భారత భూభాగంలోకి చొరబడేందుకు యత్నించిన పాకిస్థాన్ వ్యక్తిని సరిహద్దు భద్రతా దళాలు కాల్చిచంపాయి. శుక్రవారం అర్ధరాత్రి (అంటే తెల్లవారితే శనివారం) గుజరాత్ లోని బనస్కాంత్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని భద్రతా బలగాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి.బీఎస్ఎఫ్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సరిహద్దును దాటి కంచె వైపు వస్తున్న ఓ పాకిస్థాన్ వ్యక్తిని భారత జవాన్‌లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై అతడిని నిలువరించేందుకు ప్రయత్నించారు. అక్కడే ఆగిపోవాలని హెచ్చరించారు. అయినా అతడు లెక్కచేయకుండా ముందుకు రావడంతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతడు ప్రాణాలు కోల్పోయాడు. పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి సరిహద్దుల్లో భద్రతను బలగాలు కట్టుదిట్టం చేశాయి. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి 26 మంది ప్రాణాలు తీశారు. అందుకు ప్రతిగా భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. దీన్ని సహించని పాక్ సైన్యం మనపై ఎదురుదాడికి పాల్పడి భారత బలగాల చేతిలో చావుదెబ్బ తిన్నది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతోంది

## భారత్, నేపాల్ సరిహద్దులో కూంబింగ్

### పాక్ ఉగ్రవాదులున్నట్లు నిఘా సమాచారం..




**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**
పాకిస్థాన్‌కు చెందిన అనుమానిత ఉగ్రవాదులు నేపాల్‌లో ఉన్నట్లు భారత్ నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో ఇరు దేశాలకు చెందిన సైనికులు అలెర్ట్ అయ్యారు. ఇండో, నేపాల్ బోర్డర్‌లో సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్, పెట్రోలింగ్ నిర్వహించారు. భారత్‌కు చెందిన సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ), నేపాల్ సాయుధ పోలీసు దళం (ఏపీఎఫ్) ఈ మిలిటరీ డ్రిల్‌లో పాల్గొన్నారు. భారత్, నేపాల్ అంతర్జాతీయ సరిహద్దులోని నో మ్యాన్స్ ల్యాండ్ ఏరియాలోని అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానిత పాక్ ఉగ్రవాదుల కోసం వెతుకున్నారు.కాగా, నేపాలీ దళాలతో తమకు మంచి సంబంధాలున్నాయని ఎస్-ఎస్‌బీ కమాండెంట్ గంగా సింగ్ తెలిపారు. ప్రతి నెలా రెండు దేశాల సరిహద్దు దళాల మధ్య సమన్వయ సమావేశాలు జరుగుతాయని చెప్పారు. నేపాల్‌గంజ్‌లో ఒక మర్కజ్ ఉందని, పాకిస్థాన్ ప్రజలు అక్కడకు వస్తుంటారని అన్నారు. ఈ నేపథ్యంలో భద్రతకు సంబంధించిన సమాచారాన్ని నేపాల్ దళాలు తమకు అందిస్తారని వెల్లడించారు. మరోవైపు భారత్, నేపాల్ మధ్య సుమారు1,700 కిలోమీటర్లకుపైగా సరిహద్దు ఉన్నది. అయితే ఈ సరిహద్దు వెంబడి ఎలాంటి కంచె లేదు. ఈ నేపథ్యంలో అనుమానాస్పద కదలికలను గమనించడానికి సరిహద్దుకు ఇరువైపులా భారత్, నేపాలీ సైనికులను ఇరు దేశాలు మోహరించారు.

GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్ని జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024

## ఫాస్టాగ్‌లో కీలక మార్పులు తేబోతున్న కేంద్రం..!

### -ఈ పాస్‌తో ఇక హైవేలపై అన్‌లిమిటెడ్ ప్రయాణం..!

**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**
టోల్ వసూల్ వ్యవస్థలో ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురాబోతున్నది. కొత్త ప్రతిపాదిత ఫాస్టాగ్ విధానం ఉద్దేశం హైవేలపై ప్రయాణాన్ని ఇబ్బందులు లేకుండా సులభతరం చేయడమే. తరుచూ జాతీయ రహదారులపై ప్రయాణం చేసే వారికి కేంద్రం వార్షిక పాస్‌ను తీసుకురాబోతున్నది. సంవత్సరానికి ఒకే సారి రూ. 3వేలు చెల్లిస్తే దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, స్టేట్ ఎక్స్‌ప్రెస్ హైవేలపై అపరిమితంగా ప్రయాణం చేసే సౌలభ్యం కలనుగన్నది. దాంతో తరుచూ ఫాస్టాగ్‌ను రీచార్జ్ చేయాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం కేంద్రం ఫాస్టా విధానంలో రెండు కొత్త పద్ధతులను తీసుకురావాలని యోచిస్తున్నది.ఇందులో ఒకటి వార్షిక పాస్. వార్షిక సహాయంతో ఒక్కసారి ఫాస్టాగ్ ఫీజు చెల్లిస్తే సంవత్సరం మొత్తం అన్ లిమిటెడ్ హైవే జర్నీ చేసే అవకాశం ఉంటుంది. ఇందు కోసం అదనపు డాక్యుమెంట్స్ చూపించాల్సిన అవసరం కూడా ఉండదు. తక్కువ దూరం ప్రయాణించే వారు ప్రతి 100 వంద కిలోమీటర్లకు రూ. 50 చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పటికే ఫాస్టాగ్‌ని ఉపయోగిస్తున్న వారి ఇలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని.. కొత్తగా అకౌంట్‌ని తెరవాల్సిన అవసరం ఉండదు. ఎందుకంటే పాత ఫాస్టాగ్ అకౌంట్ నుంచే కొత్త పాలసీని తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా.. రూ. 30వేలు చెల్లిస్తే 15 సంవత్సరాల పాటు 'లైఫ్‌టైమ్ ఫాస్టాగ్' ప్రతిపాదన సైతం తీసుకురాగా.. ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఇదిలా ఉండగా.. కేంద్రం



కొత్త టోల్ పాలసీలో ఎలాంటి ఆటంకాలు లేని వ్యవస్థను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుంది. అంటే ప్రస్తుతం టోల్‌ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం ఇకపై ఉండదు. ప్రస్తుతం సెన్సార్ ఆధారిత వ్యవస్థను క్రమంగా తొలగించబోతున్నది. దాంతో ట్రాఫిక్ జామ్‌లు తగ్గనున్నాయి. పెట్రోల్, డీజిల్ సైతం ఆదా కానున్నది. టోల్ ఆదాయంలో మార్పును భర్తీ చేసేందుకు.. ప్రభుత్వం డిజిటల్ డేటా ఆధారంగా పరిహార ఫార్ములాను రూపొందిస్తోంది. తద్వారా టోల్ కాంట్రాక్ట్ తీసుకున్న కంపెనీలు నష్టపోకుండా ఉంటాయి. ఇంకా, కనీస ఫాస్టాగ్ బ్యాలెన్స్‌లను నిర్వహించడం వంటి చర్యలను అమలు చేయడం ద్వారా టోల్ ఎగవేతను పరిష్కరించడానికి బ్యాంకులకు మరిన్ని అధికారులు ఇవ్వనున్నది. ఫాస్టాగ్ పాలసీ ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. అమలులోకి వస్తే భారత్‌లోని కోట్లాది మంది వాహనదారులకు ప్రయాణం చౌకగా.. వేగంగా, సులభతరంగా మారనున్నది.

## మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించండి

### కుమారస్వామికి సీఎం రేవంత్ వినతి



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ,**
హైదరాబాద్‌కు మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం భేటీ అయ్యారు. ఇటీ-వల హైదరాబాద్‌కు 2000 ఈవీ బస్సులు కేటాయించారని, ప్రస్తుత నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని పీఎం-ఈ డ్రైవ్ పథకం కింద అదనంగా 800 బస్సులు కేటాయించాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లు బస్సు నిర్వహణ చూసేలా హైబ్రిడ్ జీసీసీ మోడల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర మంత్రికి సీఎం సూచించారు. తెలంగాణ ఆర్టీసీ డీజిల్ బస్సుకు రెట్రోఫిటటె-డ్ చేపట్టగా అది సఫలమైందని, ఆ బస్సు నగరంలో రాకపోకలు సాగిస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు రెట్రో ఫిట్‌మెంట్ అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## భార్యపై టాయిలెట్ క్లీనర్ యాసిడ్ చల్లిన భర్త.. ఎందుకంటే




**తెలంగాణవీణ, బెంగుళూరు**
భార్యపై టాయిలెట్ క్లీనర్ యాసిడ్ చల్లాడు భర్త. ఈ ఘటన కర్నాటక రాజధాని బెంగుళూరులోని సిద్దేదహల్లి ఎన్ఎంహెచ్ లేఔట్‌లో జరిగింది. మే 19వ తేదీన ఈ ఘటన చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే. భర్త యాసిడ్ చల్లడం వల్ల 44 ఏళ్ల మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె తల, ముఖం కాలింది. ప్రస్తుతం ఆమె ప్రమాదకర స్థితి నుంచి బయటపడింది. ఓ ఆస్పత్రిలో ఆమె కోలుకుంటోంది.పోలీసుల కథనం ప్రకారం.. ఆ మహిళ ఓ బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నది. ఆ రోజు రాత్రి 9 గంటలకు మద్యం కొనేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యను అడిగాడు భర్త. ఆమె నిరాకరించడంతో వేధించడం మొదలుపెట్టాడు. కానీ చివరకు డబ్బులు ఇచ్చిందామె. అయితే ఫుల్లుగా తాగి వచ్చిన అతను తన మొబైల్ ఫోన్‌లో పెద్దగా సౌండ్ పెట్టి పాటలు విన్నాడు. సౌండ్ తగ్గించాలని భార్య అడగడంతో.. దాన్ని అతను వ్యతిరేకించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ ప్రారంభమైంది. అకస్మాత్తుగా టాయిలెట్‌కు వెళ్లి అక్కడ ఉన్న యాసిడ్ క్లీనర్‌ను తీసుకువచ్చి భార్యపై చల్లాడతను. తల, ముఖంపై ఆ యాసిడ్ పడింది. మంట తట్టుకోలేక ఆమె అరవడంతో.. అతను అక్కడ నుంచి పారిపోయాడు. పక్కింటివాళ్లు ఆమెను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, ఆమె భర్త కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## సంపాదకీయం

# దుబారా పథకాలను సమీక్షించాలి !

ఈ మధ్య తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు ఆదాయం పెంచడమెలా అన్న దానిపై అధికారులతో వరుస సమీక్షలు చేశారు. ఆదాయాలు తెచ్చిపెట్టే శాఖల్లో అలసత్వం లేకుండా చూడాలని, అవసరమైతే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించాలని సూచించారు. ఉన్న ఆదాయాలను ఎకాకెకిన డబుల్ కావాలని కోరుకుంటున్నారు. ఎందుకంటే వీరు ఓటు బ్యాంక్ కోసం అమలు చేస్తున్న పథకాలకు నిధులు కావాలి. చేసిన అప్పులకు వడ్డీలు కట్టాలి. ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న టాస్క్ ఇదే..రోడ్లు వేయడం, ఆస్పత్రులు కట్టడం, విద్యారంగానికి కేటాయింపులు పెంచడం,ఉద్యోగ ఖాళీలను పూర్తిగా భర్తీ చేయడం వంటివన్నీ తదుపరి ప్రాధాన్యంలో ఉన్నాయి. అప్పులకు వడ్డీలు కట్టడం, జీతాలు, పెన్షన్లు ఇవ్వడంతోనే ప్రభుత్వాల పనితీరు సరిపోతోంది. కొత్త పథకాలు. ఆలోచనలు లేకుండా పోతున్నాయి. దీనికంతటికీ గుదిబండ పథకాలు,పెన్షన్లే ప్రధాన కారణమని చెప్పుకోవాలి. అయితే ఆదాయం పెరగాలని చూస్తున్న ముఖ్యమంత్రులు ఖర్చులను తగ్గించుకోవడం, దుబారాలు తగ్గించడం, గుదిబండ పథకాలను పక్కన పెట్టడంపై ఆలోచన చేయడం లేదు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం అందచేస్తున్న కిలో రూపాయి బియ్యం పథకం గుదిబండగా మారింది. ఇటీవల ఇంటింటికి బియ్యం సరఫరా పేరుతో జరిగిన దోపిడీకి ఎపి ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. ఇచ్చే రూపాయి బియ్యం కూడా వాహనాల ద్వారా ఇంటింటికి పంపిణీకి గత జగన్ ప్రభుత్వం చేపట్టగా దానిని ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. గుడ్డిలో మెల్ల అన్నచందంగా ఇది కొంత ఆదా అయినట్లే భావించాలి. అలాగే దీనివల్ల లబ్ధిపొందుతున్న వారిలో ఎంతమంది అర్హులో గుర్తించడం లేదు. గుడ్డిగా బియ్యం సరఫరా చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనీసం సగం కార్డుదారులు అనర్హులని ఏ గ్రామం వెళ్లినా ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారిని ఏరివేస్తే సగం భారం తప్పుతుంది. కానీ ఓట్లతో ఇమిడివున్న పథకం కావడంతో పాలకులు దీనిజోలికి పోవడం లేదు. పేదలకు పట్టెడన్నంపెట్టాల్న సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆరామారావు 1983 ఉగాది రోజు ప్రారంభంచారు. పేదలకు అన్నం పెట్టాలన్న ఆలోచనతో ఉమ్మడి ఎపిలో కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టారు. దాదాపు 42 ఏళ్ల కిందటి మాట. కానీ ఇప్పుడు అదే బియ్యం ధర 40 నుంచి 50కిచేరింది. కానీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కిలో రూపాయకే బియ్యం ఇస్తున్నారు. ఈ బియ్యాన్ని అమ్ముకోవడం, వ్యాపారం చేసుకోవడం అన్నది జరుగుతోంది. చాలామంది హోటళ్లకు అమ్ముకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై దాదాపు 26రూపాయలకు పైగానే సబ్సిడీ ఇస్తోంది. ఇలా ఖర్చుతో కూడుకున్న పథకం అమలు చేయడం ఎంతవరకు న్యాయం. ప్రజల డబ్బును దుబారా చేస్తున్న ఈ పథకం విధానాన్ని సమీక్షించాలి. ఆదాయ పథకాలపై కాకుండా దుబారా పథకాలపైనా సమీక్షిస్తే నిజాయితీ తెలుస్తుంది. పక్కదారి పడుతున్న పథకంపై కన్నేయాల్సిందే. నిరుపేదలకు ఉచిత పథకాలపై సమీక్షించ కుంటే తెలుగు రాష్ట్రాల్లో ఆర్థికమాంద్యం కూడా తీవ్ర ప్రభావం చూపగలదు. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృధా పథకాలతో దుబారా చేస్తున్న పథకాలకు చరమగీతం పలకాలి. ప్రజల డబ్బులకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు తమకు అనుగుణంగా, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను కొనసాగించడం సరికాదు. నిరుపేదల కడుపు నింపడానికి పంపిణీ చేయాల్సిన రాయితీ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలి అక్రమార్కుల జేబులు నింపుతోంది. సిబ్బంది కొరత, కొరవడిన తనిఖీలకు ప్రజల అమాయకత్వం జత కలవడంతో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. బియ్యం అక్రమ రవాణా చేయడం నిత్యకృత్యంగా మారినా అరికట్టాల్సిన అధికారులు చేష్టలుడిగి ప్రేక్షక పాత్రకు పరిమితమవు తున్నారు. ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేస్తే కనీసం ఓ వేయికోట్లు నెలకు ఆదా అవుతాయని ప్రజలు కూడా అంటున్నారు. కొందరు డీలర్లు కార్డులను తమ వద్దే ఉంచుకొని బియ్యాన్ని స్వాహా చేస్తూ రాష్ట్రాలను దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అమాయక ప్రజలు చేసేది లేక ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆనాటి ముఖ్యంత్రి ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు బియ్యం అందచేయాలన్న లక్ష్యంతో కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని అమలు చేశారు. ఆనాడది సంచలన నిర్ణయంగా నిలిచింది. ఆ తరవాత చంద్రబాబు సిఎం అయ్యాక దానిని ఐదు రూపాయలకు పెంచారు. దీంతో కొంత దుబారా తగ్గిందనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ కిలో రెండు రూపాయలకు చేశారు. ఇలా చేయడం వల్ల కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలు దాగి ఉన్నాయి. దీనిని కిరణ్ కుమార్ రెడ్డి సర్కార్ కిలో రూపాయికే మార్చడం ద్వారా దుబారాకు తెరలేపారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం వల్ల ఏదో ఘనకార్యం చేశామని గొప్పగా ప్రకటించుకున్నారు. తెలంగాణలో మరో అడుగు ముందుకేసి ఇప్పుడు సన్నబియ్యం సరఫరా చేసి గొప్పలు చెప్పుకుంటున్నారు. పేదవారి ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేశామని మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్పలు చెబుతున్నారు. ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాన్నికొనసాగించడం ఆర్థిక భారం తప్ప మరోటి కాదు. చంద్రబాబు మరో అడుగు ముందుకు వేసి దీనిని కూడా నగదు బదిలీగా మార్చాలని చూస్తున్నారు. అంటే నేరుగా డబ్బులు పందేరం చేయడమన్న మాట. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి ఉండదు. ఓట్ల కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఈ ఒక్క పథకం చాలు.

# ఈ నెల 31న తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ మహాసభలు

### మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన టీయూడబ్ల్యూజే కూకట్పల్లి ప్రెస్ క్లబ్




**తెలంగాణవీణ, కూకట్‌పల్లి,**
తెలంగాణ జర్నలిస్టు ఫోరం 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 31న హైదరాబాద్ జలవిహార్‌లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన గోడపత్రికను టీయూడబ్ల్యూజే కూకట్పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కూకట్పల్లి ప్రెస్ క్లబ్ వద్ద ఆవిష్కరించడం జరిగింది. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్కే దయాసాగర్, టియుడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ అధ్యక్షుల నిమ్మల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోహిరు నాగరాజు , సీనియర్ జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించడం జరిగింది. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాలను ఏకతాటి పైకి తీసుకొచ్చి స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడంలో కీలక భూమిక పోషించిందని అన్నారు. టీజేఎఫ్ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం నారాయణ ఆధ్వర్యంలో జరిగే వేడుకలను విజయవంతం చేయాలని జర్నలిస్టు మిత్రులందరికీ పిలుపునిచ్చారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో కూకట్పల్లి ప్రెస్ క్లబ్ టియుడబ్ల్యూజే నాయకులు వి భాస్కరాచారి, కైలాష్ నేత,జాషువా, ఆనంద్ రావు, తేళ్ల హరికృష్ణ, దాదే వెంకట్, బొమ్మ గోపి లక్ష్మణ్ గౌడ్, హరికుమార్ చౌదరి, షబ్బీర్, కుల్లరాజు, శ్రీనివాస్ రెడ్డి, హరి, చంద్రకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# నూతన డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**తెలంగాణవీణ, శేరి లింగంపల్లి ప్రతినిధి**
డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్నందించే దిశగా పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ లోగల శిల్పావ్యాలీ లో రూ. కోటి అరవై లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే (300ఎం ఎం డియా ఆర్ సి సి ఎన్ పి3 క్లాస్ సేవర్ లైన్ ) డ్రైనేజీ పనులను శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పీఏసీ ఛైర్మెన్ అరెఖపూడి గాంధీ తో కలిసి శంకుస్థాపన చేసిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్తులో డ్రైనేజీ సమస్యలు పునరావృతమవ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించి నూతన యూజీడీ లైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు ఇబ్బంది కలగకుండా డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి డీజీమ్ , మేనేజర్ , డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, సత్యనారాయణ, శిల్పా వ్యాలీ మేనేజంగ్ కమిటీ ప్రెసిడెంట్ సిధార్థ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ స్వాతి రెడ్డి, సెక్రటరీ భవాని, జాయింట్ సెక్రటరీ శివ రెడ్డి, ట్రెజరర్ విజయ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పద్మావతి, రమాకాంత్, సూర్యనారాయణ, గోవర్ధన్ రెడ్డి, అంకమ్మ చౌదరి, శ్రీకర్ రెడ్డి, శివ, విష్ణువర్ధన్, చిరంజీవి, సెంట్రల్ పార్క్ ఫేస్- 2 జనరల్ సెక్రటరీ వేణుగోపాల్, స్ప్రింగ్ వ్యాలీ ప్రెసిడెంట్ సాయి, కృష్ణ మూర్తి, మల్లేష్ యాదవ్, శశాంక్ స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

# డి ఎం ఎఫ్ నిధుల నుండి అదనపు తరగతి గది నిర్మాణం




**తెలంగాణవీణ,రామన్నపేట ప్రతినిధి**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలో డి ఏం ఎఫ్ నిధులనుండి 5 లక్షల రూపాయలతో పాత పాఠశాల భవనం వద్ద నిర్మించనున్న అదనపు తరగతి గది (గ్రంథాలయం)నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి,మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి,ఎంపిడిఓ యాకూబ్ నాయక్,పంచాయతీ రాజ్ ఏ.ఈ బోయ గాలయ్య,పంచాయతీ కార్యదర్శి లక్ష్మి,తాజా మాజీ వైస్ ఎంపిపి నాగటి ఉపేందర్ తాజా మాజీ వార్డు సభ్యులు నోముల ప్రవీణ్,సుర్వి సతీష్ మాజీ సర్పంచ్ లు ఆవుల నరసింహ,బోయిని ఆనంద్,గ్రామ ప్రజలు ఆవుల సత్యనారాయణ,చల్ల సత్యప్రకాష్,పేరుమండ్ల నవీన్, ఆవుల పర్వతాలు,ఆలకుంట్ల రాజు,నోముల శంకర్,విష్ణ తదితరులు పాల్గొన్నారు

# కొలనుపాకను సందర్శించిన బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేష్

**తెలంగాణవీణ,మహబూబ్నగర్**
ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని సోమేశ్వరాలయం మరియు జైన దేవాలయంను సందర్శించిన బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేష్ గౌడ్ అనంతరం బిజెపి నాయకులు శాలువతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తేరాల నరసింహులు,అంకం రాజు, తేరాల శంకర్,మిట్టపల్లి భాస్కర్ గౌడ్,వాసం కిషోర్, మిట్టపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సంగెంలో ఘనంగా బొడ్రాయి పండుగ వేడుకలు

బొడ్రాయి వద్ద యజ్ఞహోమాన్ని నిర్వహిస్తున్న గ్రామ నాయకులు



**తెలంగాణవీణ, వలిగొండ**
మండల పరిధిలోని సంగెం గ్రామంలో శనివారం బొడ్రాయి(నాభిశిల) మూడో వార్షిక మహోత్సవం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గ్రామ భక్తులు బొడ్రాయికి భక్తిశ్రద్ధలతో జలాన్ని పోసి ప్రత్యేక అభిషేకాలను, పూజలు చేశారు. అలాగే గ్రామ దేవతలకు యజ్ఞహోమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని వేద పండితుల వేదమంత్రోశ్చరణలతో బొడ్రాయికి, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని మహిళలు విచ్చేసి బొడ్రాయికి, గ్రామ దేవతలకు జలాలను పోసి ప్రత్యేక అభిషేకాలను, పూజలను చేసిన మొక్కులను చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ సకల దేవతల ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కీసరి రాంరెడ్డి కాసుల కృష్ణ నాయకులు బాతరాజు బాల నరసింహ బద్దం సంజీవరెడ్డి వరికుప్పల మల్లేశం మంద నరసింహ కందుల తానిషా గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# మయూరి ఏకో పార్కులో స్నేక్స్ షో వేసవి శిబిరం

**తెలంగాణవీణ,మహబూబ్నగర్**
మహబూబ్నగర్ స్థానిక మయూరి ఎకో పార్క్ లో అటవీశాఖ ఆధ్వర్యంలో నక్షత్ర ఈవెంట్స్ వారు స్నేక్ షో ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీ సత్యనారాయణ హాజరుయ్యారు. వేసవి సెలవులలో భాగంగా ప్రతి ఒక షో ఉంటుందని శని వారం స్నేక్ షో ఆదివారం మ్యాజిక్ షో నిర్వహిస్తారని ఈ సదావకాశాన్ని సందర్శకులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. స్నేక్ షో లో భాగంగా ప్రొఫెసర్ సదశివైయ్య విద్యార్థులు రాహుల్ మరియు ఇతర సభ్యులు పాముల గురించి సందర్శకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సత్యనారాయణ ఎఫ్ఆర్ఓ కమాలుద్దీన్ గారు స్థానిక సెక్షన్ ఆఫీస్ వాసవి నక్షత్ర ఈవెంట్స్ నరేష్ పాల్గొన్నారు.

# ముగిసిన వైట్ టీ షర్ట్ శిక్షణ శిబిరం..





## -యువజన కాంగ్రెస్ సంవిదాన్ ఘన విజయం...

**తెలంగాణవీణ,కీసర...**
తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరలోని బాల వికాస కేంద్రంలో నిర్వహించిన సంవిదాన్ వైట్ టీ షర్ట్ శిక్షణ శిబిరం శనివారంతో విజయవంతంగా ముగిసింది. యువజన కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతూ, వారిని పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాల పట్ల మరింత అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో శిబిరం నిర్వహించారు. ముగింపు సమావేశానికి జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను ఛిబ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన యువజన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. దేశ భవిష్యత్తులో యువతరం పాత్ర, సామాజిక బాధ్యతలు, పార్టీని బలోపేతం చేయడంలో వారి కృషి ఆవశ్యకతను వివరించారు. ప్రజా సమస్యలపై పోరాడటానికి, రాజ్యాంగ విలువలను పరిరక్షించడానికి యువత ముందుండాలని పిలుపునిచ్చారు. శిక్షణ శిబిరంలో యువజన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కీలకమైన అంశాలపై శిక్షణనిచ్చిందని, వారిలో రాజకీయ చైతన్యాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించిందని శివ చరణ్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న యువజన నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా శిక్షణలో పాల్గొని, భవిష్యత్తులో పార్టీ సేవకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## డీఈవో విజయకుమారి



**తెలంగాణ వీణ, మేడ్చల్:**
ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను, కల్పిస్తున్న సదుపాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీఈవో విజయకుమారి అన్నారు. మూడుచింతలపల్లి మండల స్థాయిలో కొల్తూర్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న టీచర్లకు శిక్షణ శిబిరాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఎస్ఎల్ఎన్, (ఏఐ) అర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రజల్లోకి తీసుకెళ్లిన్నప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, నమోదు శాతం పెంచాలన్నారు. నాన్యతపై దృష్టి సారించి ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు. ఎంఈవో భాగ్యమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెలంగాణ నీళ్లు నిధులు నియామకాల పై మాట్లాడే అర్హత నీకు లేదు జగదీశ్ రెడ్డి.

## -వలిగొండ నరసింహ ఓయూ విద్యార్థి నాయకులు




**తెలంగాణ వీణ/ఓయూ:**
విద్యార్థి నిరుద్యోగులు ఎంతో మంది యువత బలిదానాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలు స్వరాష్ట్ర తెలంగాణని విధ్వంసం చేసిన కేసిఆర్ కుటుంబ పాలనలో కీలక పాత్ర వహించి నేడు ఉద్యమాల గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ లో సెమినార్ ముసుగులో వచ్చి నీళ్లు నిధులు నియామకాలు అనే అంశంపై మాట్లాడే అర్హత నీకు లేదు జగదీశ్వర్ రెడ్డి, నీళ్ల పేరా నిధులు దోచుకుని కూలిపోయిన కాళేశ్వరం కట్టి నిధులన్నీ నీళ్లలో పోసి, నిధులను బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేలు ఎంపీల ఖాతాల్లోకి మలుపుకొని తెలంగాణ రాష్ట్రాన్ని దివాలా తీసి, ఉద్యోగ నోటిఫికేషన్లు వేయక తెలంగాణ యువతని మానసికంగా వేధించి ఇచ్చిన నోటిఫికేషన్ ఉద్యోగాలు అమ్ముకొని, ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు యూనివర్సిటీలను విధ్వంసం చేసి విద్యార్థి యువత జీవితాలను సర్వ నాశనం చేసిన, మీ పార్టీ అధినేత కెసిఆర్ పాపాల ఫలితం వారి కుటుంబం విచ్ఛిన్నం అయిపోతుంది అది ముందు సర్దుకోండి, తెలంగాణ రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగ విద్యార్థుల పక్షాన పోరాడి ఉద్యోగాల నియామకాలు పారదర్శకంగా నియామకం చేస్తూ, యూనివర్సిటీల బలోపేతం కోసం కృషి చేస్తు తెలంగాణని పునర్నిర్మిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై కాంగ్రెస్ పార్టీపై అవాక్కులు చవాకులు మాట్లాడి,అసత్య ఆరోపణలు ప్రచారాలు చేస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో శివ ,సందీప్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# జోన్ ఛైర్మన్ గా ఎన్నికైన ఆకుల సుఖేందర్



**తెలంగాణ వీణ/ చేగుంట**
మెదక్ జిల్లా, చేగుంట పట్టణ కేంద్రానికి చెందిన లయన్ ఆకుల సుఖేందర్ కు శామీర్ పేటలో సమ్మర్ గ్రీన్ రిసార్ట్ లో లయన్స్ ఇంటర్నేషనల్ 320 డి లో గల సిద్దిపేట రీజియన్ లోని చేగుంట, రామాయంపేట,తూప్రాన్ లయన్స్ క్లబ్ లకు జోన్ ఛైర్మన్ గా చేగుంట లయన్స్ క్లబ్ నుండి 320 డి గవర్నర్ లయన్ అమర్నాథ్ నియమించడం జరిగింది. అని సిద్దిపేట రీజియన్ ఛైర్మన్ లయన్ ఉప్పల సంజయ్ గుప్త తెలియజేశారు. చేగుంట లయన్స్ క్లబ్ నుండి మూడు సార్లు సెక్రెటరీ గా, ప్రెసిడెంట్ గా ,రెండుసార్లు డిస్ట్రిక్ ఛైర్పర్సన్ గా బాధ్యతలు తీసుకొని చేసినటువంటి సేవాకర్యమలు గుర్తించి 2025 మరియు 2026 సంత్సరముకు గాను జోన్ ఛైర్మన్ గా ఎన్నిక చేయడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో 320 డి జిల్లా గవర్నర్ అమర్నాథ్,మొదటి గవర్నర్ విజయలక్ష్మి, రెండోవ గవర్నర్ నరసింహరాజు, జి యల్ టి కోఆర్డినేటర్ పద్మావతి, జిల్లా కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ యాల్ శ్రీనివాస్, డిస్ట్రిక్ క్యాబినెట్ ట్రేసరెర్ మర్రి ప్రవీణ్, సిద్దిపేట రీజియన్ ఛైర్మన్ సంజయ్ గుప్త, డిస్ట్రిక్ సెక్రెటరీ ఐటీ శ్రీధర్, చేగుంట క్లబ్ నుండి యస్ శ్రీనివాస్,పి నాగరాజు, కే నాగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్ విజయవంతం

## ఉప్పల్ నియోజకవర్గంలో తిరంగా యాత్ర లో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీ ఎస్ ఎస్ ప్రభాకర్..జిల్లా అధికార బీజేపీ ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్..





**తెలంగాణ వీణ/నాచారం:**
పాకిస్తాన్ పై ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం సాధించిన విజయాన్ని పురస్కరించుకుంటూ ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్లో చేపట్టిన తిరంగా యాత్రలో ముఖ్యఅతిధులుగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీ ఎస్ ఎస్ ప్రభాకర్, మాజీ శాసన సభ్యులు బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు S.మల్లారెడ్డి, తాడూరి శ్రీనివాస్, శిల్పా రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ గోరిగే కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్,చంద్రమౌళి, హన్మంత్ బిరాధర్, వై.సత్యనారాయణ, మల్కా ప్రకాష్,కొమ్మగల్ల నవీన్ కుమార్,మోహన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, గంధ మల్ల గోపి,కాటేపల్లి రవీందర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి,మంజుల వాణి, క్రాంతి కుమార్,నవీన్ కుమార్ చింటూ,ప్రతాప్ రెడ్డి, ఉదయ్, మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# అమర వీరులకు కొవ్వత్తుల నివాళి





**తెలంగాణ వీణ/తార్నాక:**
భారత్ పాకిస్తాన్ ఉగ్రమూకలపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్లో అమరులైన వీర జవాన్లకు శనివారం లాలాపేటలోని ప్రొ జయశంకర్ స్టేడియం వద్ద స్థానికులు పిల్లలు, పెద్దలు, మహిళలు కొవ్వత్తుల నివాళి అర్పించారు. భారతీయ సైనికుల త్యాగాలను కీర్తిస్తూ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో సహారా స్మాల్ స్కేల్ ఇండస్ట్రియల్ ప్రసిడెంట్ గంథమాల నర్సింగరావు పాల్గొని మాట్లాడుతూ కాశ్మీర్ పహల్గాంలో అమాయకులైన పర్యాటకులపై పాక్ ఉగ్రవాదులు చేసిన కాల్పులను యాదవ్ భారతదేశంలో ఆ దాడిని ముక్త కంఠంతో తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కాల్పుల్లో మరణించిన వారికి సానుభూతి ప్రకటించారు. మన భారతీయ స్త్రీల నొదుటి సింధూరాన్ని తూడ్చి వేయాలనీ ప్రయత్నించిన ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్ పాక్ కు ధీటైన సమాధానం చెప్పిందన్నారు. భారతదేశం సత్తాను చాటిని త్రివిధ దళాలకు దేశ ప్రజలందరూ సెల్యూట్ చేస్తున్నారనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాస్కుల కొమురయ్య, వేణు, ప్రసాద్, బాలమణి తదితరులున్నారు.

# బాధితునికి బియ్యం అందజేసిన శ్రీనివాస్



**తెలంగాణ వీణ/ చేగుంట**
మెదక్ జిల్లా చేగుంట మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసిన చౌదరి శ్రీనివాస్ దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో మొయ్య నర్సవ్వ. చనిపోయిన విషయం తెలుసుకొని. చేగుంట మండల్. కిసాన్ సెల్ అధ్యక్షులు చౌదరి శ్రీనివాస్ ఈరోజు 50కిలోల బియ్యం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎగ్గడి శేఖర్ కొమ్ము శ్రీనివాస్ మొయ్య రాజు ఎగ్గడి నర్సింలు మోడమైన బాలేల్లం ఎగ్గడి వెంకటి వాళ్ళు పాల్గొన్నారు.

## ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది



**తెలంగాణ వీణ,మంచిర్యాల జిల్లా...**
జన్నారం : ఉపాధి లేక తెలంగాణ ధూంధాం కళాకారులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ నిరుద్యోగ ఉద్యోగ సంఘం మంచిర్యాల జిల్లా ఇంచార్జ్ లింగంపల్లి రాజలింగు అన్నారు. శనివారం జన్నారంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పాలమూరు వాసి నట్టల సప్నకు తెలంగాణ కళాకారులు నివాళులర్పించారు. తెలంగాణ మరిదశ ఉద్యమంలో కళాకారులు ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాష్ట్ర యాక్షన్ కమిటీ కొండుకూరి రాజు, సభ్యులు జిల్లా కళాకారులు ఆకుల నరేష్, గూడ రాజేందర్,కొండుకూరి ప్రభుదాస్, ఆవునూరి సత్యం, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు

## జిపిఓ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

**తెలంగాణ వీణ,మహబూబ్నగర్...**
ఆదివారం గ్రామ పాలనా అధికారుల పరీక్ష పరీక్ష నిర్వహణ పై జిల్లా కలెక్టర్ లు, రెవిన్యూ అదనపు కలెక్టర్ లు, చీఫ్ సూపరింటెండెంట్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన భూ పరిపాలన శాఖ ప్రధాన కమీషనర్ నవీన్ మిట్టల్.గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి :: భూ పరిపాలన శాఖ ప్రధాన కమీషనర్ నవీన్ మిట్టల్.గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని భూ పరిపాలన శాఖ ప్రధాన కమీషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు.శనివారం భూ పరిపాలన శాఖ ప్రధాన కమీషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై జిల్లా కలెక్టర్లు, రెవిన్యూ అదనపు కలెక్టర్ లు, చీఫ్ సూపరింటెండెంట్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, రెవిన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భూ పరిపాలన శాఖ ప్రధాన కమీషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, మే 25న ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 01:30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు.పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందు అభ్యర్థులను పరీక్ష హాల్ లోకి అనుమతిస్తారని, ఉదయం 10 గంటల తర్వాత అభ్యర్థులకు పరీక్ష హాల్లోకి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు అభ్యర్థులు ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతించ బడరని తెలిపారు. పరీక్ష ముగిసే వరకు బయటకు వెళ్లడానికి అనుమతి లేదని తెలిపారు. అభ్యర్థులు ఇటీవలి పాస్ పోర్ట్ సైజ్ కలర్ ఫోటో, గుర్తింపు కోసం పని చేయుచున్న కార్యా లయ అధికారి జారీ చేసిన ఐడెంటిటీ కార్డు, ఆధార్ కార్డ్ తీసుకురావాలి. హాల్ టికెట్ అభ్యర్థి ఫోటోపై సంబంధిత కార్యాలయ అధికారితో సంతకం చేయించుకోవాలని. అభ్యర్థులు మొబైల్, సెల్యులర్ ఫోన్లు టాబ్లెట్లు, పెన్ డ్రైవ్ లు, బ్లూటూత్ పరికరాలు వంటి ఎలక్ట్రానిక్ లేదా ఇతర గాడ్జెట్ లు,. మనికట్టు



గడియారాలు వాచ్ కాలిక్యులేటర్లు లాగ్ టేబుల్ లు, వాలెట్లు పర్సులు, నోట్స్ చార్టు, వదులుగా ఉన్న సీట్లు లేదా రికార్డింగ్ పరికరాలను శరీరానికి లేదా జేబులో కట్టుకొని ఉంచుకునేవి పరీక్ష కేంద్రంలోకి తీసుకు వెళ్లేందుకు అనుమతి లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు హ్యాండ్ బ్యాగులు, జోలాలు, పౌచులు మొదలైన వాటిని తీసుకొని పరీక్షకు రాకూడదని సూచించారు. అభ్యర్థులు విలువైన వస్తువులు లేదా వస్తువులను భద్రపరచడానికి క్లాక్ రూమ్ నిల్వ సౌకర్యం పరీక్షా కేంద్రాల్లో అందుబాటులో లేదని తెలిపారు.అభ్యర్థులు పరీక్ష హాల్లోకి నలుపు/ నీలం బాల్ పాయింట్ పెన్నులు, ఇతర రంగుల పెన్నులు నిషేధించినట్లు ఇంకా జెల్ పెన్నులు ఉపయోగించ వద్దని ఆయన తెలిపారు. అభ్యర్థులు పరీక్ష హాల్ నుండి బయటకు వెళ్లే ముందు సమాధాన బుక్ లెట్ ను ఇన్విజిలేటర్ కు అప్పగించాలని తెలిపారు ఒకవేళ అప్పగించనిచో వారి అభ్యర్థిత్వం తిరస్కరించడం తోపాటు క్రిమినల్ చర్యలకు కూడా గురవుతారని ఆయన పేర్కొన్నారు అన్ని సమాధాన బుక్లెట్లను ఇన్విజిలేటర్ సేకరించే వరకు ఏ అభ్యర్థి కూడా పరీక్ష హాల్ నుండి బయటకు వెళ్లకూడదని తెలిపారు పరీక్షల్లోని అభ్యర్థులు పరీక్ష ముగిసిన వెంటనే ఒకేసారి బయలుదేరాలని సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మేర ఇన్విజిలేటర్ నియమించాలని, పరీక్ష కేంద్రం వద్ద, స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్ల తో మెడికల్ టీం ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల రూట్ లలో బస్సు నడపాలని అన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ పక్కల జిరాక్స్ షాపులు మూసి వేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని అన్నారు.పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్ చేసి జేఎన్టియూహెచ్ కు అందించాలని, ఉపయోగించని జవాబు పత్రాలను కూడా తప్పనిసరిగా పరీక్ష కేంద్రాల నుంచి సేకరించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీటింగ్ అరేంజ్మెంట్స్ పక్కాగా ఉండాలని, అభ్యర్థులకు అవసరమైన త్రాగు నీరు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించాలని అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్.డి.ఓ. నవీన్, చీఫ్ సూపరింటెండెంట్ మహమ్మద్ అహ్మద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మయూరి ఏకో పార్కులో స్నేక్స్ షో వేసవి శిబిరం





**తెలంగాణ వీణ,మహబూబ్నగర్..**
మహబూబ్నగర్ స్థానిక మయూరి ఎకో పార్క్ లో అటవీశాఖ ఆధ్వర్యంలో నక్షత్ర ఈవెంట్స్ వారు స్నేక్ షో ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీ సత్యనారాయణ హాజరుయ్యారు. వేసవి సెలవులలో భాగంగా ప్రతి ఒక షో ఉంటుందని శని వారం స్నేక్ షో ఆదివారం మ్యాజిక్ షో నిర్వహిస్తారని ఈ సదావకాశాన్ని సందర్శకులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. స్నేక్ షో లో భాగంగా ప్రొఫెసర్ సదశివైయ్య విద్యార్థులు రాహుల్ మరియు ఇతర సభ్యులు పాముల గురించి సందర్శకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సత్యనారాయణ ఎఫ్ఆర్ఓ కమాలుద్దీన్ గారు స్థానిక సెక్షన్ ఆఫీస్ వాసవి నక్షత్ర ఈవెంట్స్ నరేష్ పాల్గొన్నారు.

## శిక్షణలు విద్యార్థుల ఉన్నతికి వినియోగించాలి

**తెలంగాణ వీణ,కారేపల్లి...**
ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణాంశాలను తరగతిగదిలో అమలు జరిపి వారి ఉన్నతికి ఉపయోగపడేలా చేయాలని సింగరేణి మండల విద్యాశాఖాధికారి దుగ్గిరాల జయరాజ్ అన్నారు. బాష, గణిత, కనీస సామర్థ్యాల సాధన పై మండల స్థాయి ఎస్‌జీటీ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, డీఎస్సీ-2008 ఉపాధ్యాయులకు కారేపల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈసందర్బంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో జయరాజు మాట్లాడుతూ సులభతర బోధనా విధానాలు అమలు చేయటం ద్వారా విద్యార్థుల ఉన్నతి సాధించగ ల్గుతారన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు కనీస సామర్థ్యాలు, గుణాత్మక విద్యను అందించటానికి టీఎల్ఎం, గ్రంధాలయం ను వినియోగించుకోవాలన్నారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లు నిర్వహించి పాఠశాల నిర్వాహణలో, విద్యార్థులు నమోదుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం




పదోతరగతిలో మండల పస్ట్ వచ్చిన విద్యార్థిని చాగంటి సాయి మన్వితను సన్మానించారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎండీ.బాబు, రిసోర్స్ పర్సన్లు బీ.శ్యామ్‌లాల్, ఎల్.లక్ష్మణ్, బీ.శ్రీను, బీ.రామకోటి, జాకీర్‌బాబా, కే.బాలాజీ, మోహన్, బీ.వీరన్న సీఆర్పీలు భూక్య విజయ్, లకావత్ రాము, ప్రమీల, వాంకుడోత్ మోతిలాల్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



**తెలంగాణ వీణ,పాపన్నపేట...**
నకిలీ విత్తనాలు, ఎరువులు,మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి నాగమాధురి, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, హెచ్చరించారు. శనివారం పాపన్నపేట మండల కేంద్రంలోని మహిళా సమైక్య సమావేశ భవనంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుల మందు, విత్తనాలు అమ్మే డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాబోవు ఖరీఫ్‌లో ఎటువంటి నకిలీ విత్తనాలు,ఎరువులు, పురుగు మందులు అమ్మిన చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు ప్రతి ప్యాకెట్ పైన ప్రభుత్వ ధ్రువీకరణ ట్యాగ్, విత్తన రకం, గడువు తేదీ, లాట్ నంబర్, ఇతర ముఖ్యమైన వివరాలు ముద్రించబడి ఉండాలన్నారు మరియు కొనుగోలు చేసిన రైతులకు ఆ వస్తువుకు సంబంధించిన బిల్లు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సరైన ధరలకు సరైన మందులను,ఎరువులను విత్తనాలను విక్రయించాలన్నారు. లేనిపక్షంలో చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

## వైద్యుల నిర్లక్ష్యానికి బలైన మహిళ..!

### మృతదేహంతో రోడ్డెక్కిన బంధువులు వర్షంలోనూ ఆందోళన

**తెలంగాణ వీణ,నిర్మల్...**
వైద్యుల నిర్లక్ష్యం మహిళ ప్రాణాలను బలితీసుకున్నదని ఆరోపిస్తూ, ఆగ్రహానికి గురైన బంధువులు మృతదేహంతో సహా రోడ్డుపై ఆందోళన చేపట్టిన ఘటన గురువారం నిర్మల్ పట్టణంలో చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా మామడ మండలం కమల్కోట్ గ్రామానికి చెందిన సరిత (28) అనే వివాహితకు ఇటీవల రెండవ సంతానం జన్మించింది.



అనంతరం ఆమెకు రొమ్ములో ఇన్ఫెక్షన్ రావడంతో మూడు రోజుల క్రితం నిర్మల్‌లోని డాక్టర్స్ లేన్‌లో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు ఆమెకు కిడ్నీ సమస్య ఉందని, మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు వెళ్లాలంటూ సూచించారు.బుధవారం ఆమె నిజామాబాద్ ఆసుపత్రిలో చేరినా, పరిస్థితి విషమించి గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. దీనిపై తీవ్ర ఆవేదనకు గురైన బంధువులు, ఆమె మృతికి నిర్మల్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ, మృతదేహంతో ఆసుపత్రి ఎదుట రహదారిపై ఆందోళనకు దిగారు.వర్షం పడుతుండగా కూడా నిరసన కొనసాగించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, బాధితులను శాంతింపజేశారు. ఈ ఘటనపై స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు సమగ్ర విచారణ కోరుతున్నారు.

# బిజినెస్

## సింగిల్ చార్జ్‌పై 835 కిలోమీటర్ల మైలేజ్.. అదరగొడుతున్న చైనా కారు

తెలంగాణవీణ, బిజినెస్

షియోమి వైయూ7 పేరుతో విడుదలైన ఈ కారు డిజైన్ ఎంతో ఆకట్టుకుంటోంది. గాలిపై స్వారీ అనే అర్థం వచ్చేలా ఈ పేరు పెట్టారు. దీని ప్రత్యేకతల్లోకి వెళితే ముందుగా రేంజ్ గురించి చెప్పుకోవాలి. పూర్తిస్థాయి సింగిల్ చార్జిపై సుమారు 835 కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చు. కారు పొడవు 4,999 ఎంఎం, వెడల్పు 1,996 ఎంఎం, ఎత్తు 1600 ఎంఎం, వీల్ బేస్ 3000 ఎంఎం కొలతలతో తయారు చేశారు. మూడు రకాల ఆకర్షణీయమైన రంగుల్లో షియోమి కారు ఆకట్టుకుంటోంది. ఎమరాల్డ్ గ్రీన్, టైటానియం సిల్వర్, లావా ఆరెంజ్ కలర్లలో సూపర్ లుక్ తో తీసుకువచ్చారు. కేవలం 3.23 సెకన్లలోనే సున్నా నుంచి వంద కిలోమీటర్ల వేగం అందుకోవడం ఈ కారు ప్రత్యేకత. గరిష్టంగా గంటకు 253 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీస్తుంది. ప్రత్యేకతల విషయానికి వస్తే గరిష్ట రివల్యూషన్ ను 22,000 ఆర్ పీఎంకు పెంచారు. 528 ఎన్ ఎం గరిష్ట టార్క్ విడుదల అవుతుంది. దీనిలోని డ్యూయల్ మోటారు ఫోర్ వీల్



డ్రైవ్ వెర్షన్ ద్వారా గరిష్టంగా 680 బీహెచ్ పీ హార్స్ పవర్, 508 కేడబ్ల్యూ గరిష్ట శక్తి పొందుతుంది. దీంతో కారు పనితీరు బ్రహ్మాండంగా ఉంటుంది. షియోమి వైయూ7 కారును మూడు రకాల వేరియంట్లలో అందుబాటులోకి తీసుకువచ్చారు. వాటికి స్టాండర్డ్, ప్రో, మాక్స్ అని పేర్లు పెట్టారు. వీటిలో స్టాండర్డ్ వేరియంట్ ను బేస్ మోడల్ అని చెప్పవచ్చు. దీనిలో 96.3 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఏర్పాటు చేశారు. సింగిల్ చార్జిపై సుమారు 835 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. రెండో వేరియంట్ అయిన ప్రో మోడల్ కారులో 96.3 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ అమర్చారు. దీని రేంజ్ సుమారు 760 కిలోమీటర్లు. చివర వేరియంట్ అయిన మాక్స్ లో 101.7 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఉంది. ఇది సుమారు 770 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది.అత్యంత వేగవంతంగా చార్జింగ్ కావడం ఈ కారు బ్యాటరీల మరో ప్రత్యేకత. 897 వీ పీక్ వోల్టేజ్ తో 800 వీ సిలికాన్ కార్బైడ్ హై వోల్టేజ్ ప్లాట్ ఫాం కారణంగా తొందరగా చార్జింగ్ అవుతాయి. కేవలం 12 నిమిషాల్లో పది శాతం నుంచి 80 శాతం చార్జింగ్ అవుతుంది. కేవలం 15 నిమిషాల పాటు చార్జింగ్ చేస్తే సుమారు 620 కిలోమీటర్ల ప్రయాణించవచ్చు. కాగా.. చైనా కంపెనీ షియోమి నుంచి ఎప్పటికే ఎస్ యూ7 పేరుతో ఎస్ యూవీ విడుదలైంది. దాన్ని విడుదల చేసిన 27 నిమిషాల్లోనే 50 వేల ఆర్డర్లు వచ్చినట్టు కంపెనీ తెలిపింది. ఈ కార్ల ద్వారా భారతదేశంలోని ఎలక్ట్రిక్ మార్కెట్ లో తన వాటా పెంచుకోవాలని షియోమీ భావిస్తోంది.

## రోడ్లపై దూసుకుపోనున్న ఓలా బైక్స్.. ఆ బైక్ డెలివరీలు షురూ



తెలంగాణవీణ, బిజినెస్

ఓలా రోడ్ స్టర్ ఎక్స్ బైక్ లో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. దీన్ని 2.5, 3.5, 4.5 కేడబ్ల్యూహెచ్ అనే మూడు రకాల బ్యాటరీ ప్యాక్ లతో తీసుకువచ్చారు. ప్రతి వేరియంట్ లో 4.3 అంగుళాల ఎల్ సీడీ ఇన్ స్ట్రుమెంట్ ప్యానల్ ఏర్పాటు చేశారు. బ్లూటూత్ కనెక్టివిటీ, టర్న్ బై టర్న్ నావిగేషన్, రివర్స్ మోడ్, క్రూయిజ్ కంట్రోల్ తదితర ప్రయోజనాలు అందిస్తుంది. బ్రేక్ బై వైర్ టెక్నాలజీ, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ అదనపు ప్రత్యేకతలు. రోడ్ స్టర్ ఎక్స్ లో టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్కు, వెనుక భాగంలో డ్యూయల్ షాక్ అబ్జార్వర్లు ఏర్పాటు చేశారు. ముందు 18 అంగుళాలు, వెనుక 17 అంగుళాల అల్లాయ్ వీల్స్ అమర్చారు. ఇవి రెండూ ట్యూబ్ లెస్ టైర్లు కావడం విశేషం. ఈ బైక్ గ్రౌండ్ క్లియరెన్స్ 180 ఎంఎంగా ఉంది. అలాగే అన్ని వేరియంట్లలో 7కే మిడ్ మౌంటెడ్ మోటారును వినియోగించారు.

### బెస్ వేరియంట్

రోడ్ స్టర్ ఎక్స్ బైకు సిరీస్ లోని బేస్ వేరియంట్ లో 2.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఏర్పాటు చేశారు. దీని ధర కేవలం రూ.74,999 (ఎక్స్ షోరూమ్) మాత్రమే. పూర్తిస్థాయి సింగిల్ చార్జిపై సుమారు 140 కిలోమీటర్లు పరుగులు తీస్తుంది. గంటకు గరిష్టంగా 105 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేయవచ్చు. కేవలం 3.4 సెకన్లలోనే సున్నా నుంచి 40 కిలోమీటర్ల వేగం అందుకుంటుంది.

### మిడ్ స్పెక్ వేరియంట్

మిడ్ స్పెక్ వేరియంట్ లో 3.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ అమర్చారు. సింగిల్ చార్జిపై సుమారు 196 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. బేస్ మోడల్ తో పోల్చితే చాలా మెరుగైన పరిధిని అందిస్తుంది. కేవలం 3.1 సెకన్లలో సుమారు 40 కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. గంటకు గరిష్టంగా 108 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంది. ఈ మిడ్ స్పెక్ వేరియంట్ రూ.84,999కి అందుబాటులోకి వచ్చింది.

## మళ్లీ భారీగా పెరిగిన బంగారం ధరలు..

### తెలుగు రాష్ట్రాల్లో లేటెస్ట్ రేట్లు ఇవే

తెలంగాణవీణ, బిజినెస్

గతంలో ఎన్నడూ లేని విధంగా పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి.. నెల క్రితం లక్ష మార్కు దాటేసిన బంగారం ధరలు.. ఆ తర్వాత తగ్గుతూ వచ్చాయి.. ఈ క్రమంలోనే తగ్గిన బంగారం ధరలు తగ్గినట్లే తగ్గి.. మళ్లీ పెరుగుతున్నాయి.. 95వేల వరకు దిగొచ్చిన బంగారం ధరలు.. మళ్లీ నాలుగైదు రోజుల్లోనే 98వేల మార్క్ దాటాయి. బుధవారం రూ.2400 మేర పెరిగిన ధరలు.. తాజాగా.. శనివారం కూడా పెరిగాయి.. స్వచ్ఛమైన బంగారం పదిగ్రాములపై రూ.550 మేర ధర పెరిగింది.. పలు బులియన్ మార్కెట్‌లలో నమోదైన ధరల ప్రకారం.. 24 క్యారెట్ల పసిడి ధర పది గ్రాములపై రూ.550 మేర ధర పెరిగి రూ.98,080 గా ఉంది. 22 క్యారెట్ల



బంగారం 10 గ్రాముల ధర రూ.500 మేర పెరిగి రూ.89,900 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.100 మేర ధర తగ్గి.. రూ.99,900 లుగా ఉంది.

### బంగారం, వెండి ధరలు..

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.98,080గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 89,900లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర హైదరాబాద్‌లో రూ.1,10,900లుగా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.98,080గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 89,900లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,10,900లుగా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.98,230గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 90,050లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.99,900లుగా ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.98,080, 22 క్యారెట్ల ధర రూ.89,900 గా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.98,080, 22 క్యారెట్ల ధర రూ.89,900 గా ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.98,080, 22 క్యారెట్ల ధర రూ.89,900 గా ఉంది.

# స్పోర్ట్స్

## టీమ్ ఇండియా టెస్ట్ సిరీస్‌కు కెప్టెన్‌గా గిల్..

### ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ

తెలంగాణవీణ, క్రీడలు :

ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో భారత టెస్ట్ క్రికెట్ జట్టు కెప్టెన్ ఎవరన్నదానిపై క్లారిటీ వచ్చేసింది. అందరూ ఊహించినట్టే.. టీమిండియా 37వ టెస్ట్ కెప్టెన్ గా శుభ్‌మన్ గిల్ ( ) నియమితులయ్యారు. ముంబైలో జరిగిన సీనియర్ సెలక్షన్ కమిటీ సమావేశంలో బీసీసీఐ ఈ మేరకు ప్రకటించింది. ఇక వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్‌కు ఛాన్స్ ఇచ్చారు.ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్టుల సిరీస్ ఆడేందుకు వెళ్లనున్న భారత జట్టు సభ్యుల జాబితాను బీసీసీఐ ప్రకటించింది. జట్టులో గిల్(కెప్టెన్), పంత్(వైస్ కెప్టెన్), యశశ్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్,



కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, జడేజా, ధ్రువ్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్ ఉన్నారు. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ ప్యానెల్, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇవాళ సమావేశమైన ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. జూన్ 20న హెడింగ్లీలో ప్రారంభమయ్యే ఇంగ్లండ్‌తో జరిగే 5 టెస్టల సిరీస్‌కు 18 మందితో కూడిన జట్టును ఎంపిక చేశారు.

## రజత్ పాటిదార్‌కు షాక్..

### రూ.24లక్షల జరిమానా విధించిన ఐపీఎల్ పరిపాలన..!

తెలంగాణవీణ, క్రీడలు :

సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమిపాలైన రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ రజత్ పాటిదార్‌కు రూ.24లక్షల జరిమానా విధించారు. సన్‌రైజర్స్ కెప్టెన్ పాట్ కమిన్స్‌కు సైతం స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా విధించారు. ఈ సీజన్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి.. తొలిసారిగా స్లో ఓవర్‌రేట్ రావడంతో కేవలం రూ.12లక్షల జరిమానా విధించారు. నిర్ణీత ఓవర్ల కోటాను సమయంలోగా వేయకపోవడంతో ఇది రెండోసారి. దాంతో రజన్ పాటిదార్‌కు ఐపీఎల్ పరిపాలన రూ.24లక్షల జరిమానా విధించింది.ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా మిగిలిన ప్లేయింగ్ పదకొండు మంది సభ్యులకు వ్యక్తిగతంగా రూ.6 లక్షలు.. లేదంటే మ్యాచ్ ఫీజులో 25 శాతం,



ఏది తక్కువైతే అది జరిమానాగా విధించనున్నట్లు తెలిపింది. షాకింగ్ విజయం ఏంటంటే.. ఆర్‌సీబీ జట్టు ముందుగా బౌలింగ్ చేసింది. ఈ మ్యాచ్‌లో రజత్ కాకుండా.. జితేశ్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించాడు. రజత్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు వచ్చాడు. అయినా ఈ మ్యాచ్‌లో రూ.24లక్షల జరిమానా విధించారు. రెగ్యులర్ కెప్టెన్ పాటిదార్ కావడంతో జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం.. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్‌కు రూ.12లక్షల జరిమానా విధించారు. సన్‌రైజర్స్ ఇప్పటికే ఐపీఎల్ ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించింది. ఆర్‌సీబీ ప్లేఆఫ్‌లోకి దూసుకెళ్లింది. సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 42 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఐపీఎల్ చివరి మ్యాచ్‌ను సన్‌రైజర్స్ ఈ నెల 27న లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనున్నది. ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసిన ఎస్‌ఆర్‌హెచ్.. ఆ తర్వాత 19.5 ఓవర్లలోనే 189 పరుగులకు ఆర్‌సీబీని ఆల్ అవుట్ చేసింది. సన్‌రైజర్స్‌పై ఓటమితో ఆర్‌సీబీ పాయింట్ల పట్టికలో తొలి రెండుస్థానాలకు చేరుకోవడం కష్టంగా మారింది. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 48 బంతుల్లో 94 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ మ్యాచులో ఇషాన్ ఏడు ఫోర్లు, ఐదు సిక్సర్లు బాదాడు.

## మలేషియా మాస్టర్స్ ఫైనల్లోకి శ్రీకాంత్



తెలంగాణవీణ, క్రీడలు :

ఇండియన్ స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ .. మలేషియా మాస్టర్స్ సూపర్ 500 టోర్నీ ఫైనల్లోకి ప్రవేశించాడు. బీడబ్ల్యూఎఫ్ ఈవెంట్‌లో ఆరేళ్ల తర్వాత శ్రీకాంత్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. జరిగిన సెమీస్ మ్యాచ్‌లో అతను వరుస గేమ్‌ల్లో విజయం సాధించాడు. జపాన్‌కు చెందిన యుషి తనకపై 21-18 , 24-22 స్కోరుతో నెగ్గాడు. 2019 తర్వాత శ్రీకాంత్.. తొలిసారి బీడబ్ల్యూఎఫ్ ఫైనల్లోకి ఎంట్రీఇచ్చాడు. గతంలో వరల్డ్ నెంబర్ వన్ స్థానంలో ఉన్న 32 ఏళ్ల ఆ ప్లేయర్ మళ్లీ చాన్నాళ్ల తర్వాత టాప్ ఆటను కనబడిచాడు. ప్రస్తుతం అతను 65వ ర్యాంక్‌లో ఉన్నాడు. ఓ దశలో ఈ టోర్నీ కోసం అతను క్వాలిఫైయర్స్ ఆడాల్సి వచ్చింది.వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడలిస్ట్ అయిన శ్రీకాంత్.. వరల్డ్ నెంబర్ 23 తనకపై వరుస గేమ్‌ల్లో థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేశాడు. 2017లో అతను బీడబ్ల్యూఎఫ్ నాలుగు టైటిళ్లు గెలిచాడు. గత కొన్ని సీజన్ల నుంచి శ్రీకాంత్ తడబడ్డాడు. ఫామ్, ఫిట్‌నెస్ కోసం తీవ్రంగా శ్రమించాడు.



# రీరిలీజ్‌లో రికార్డులు క్రియేట్ చేస్తున్న ఖలేజా ..

## మహేషా, మజాకానా మరి..!

**తెలంగాణవీణ, సినిమా :**
సూపర్ స్టార్ మహేష్ బాబు – త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన ఖలేజా చిత్రం 2010లో విడుదలై కమర్షియల్‌గా హిట్ కాలేకపోయింది. అయితే ఈ మూవీ ఒక కల్ట్ క్లాసిక్ గా మారింది అని చెప్పవచ్చు. థియేటర్‌లో హిట్ కాకపోయిన ఈ చిత్రం టీవీలో వస్తే మాత్రం మంచి టీఆర్పీని సంపాదించుకుంది. ఎప్పుడు రిలీజ్ అయిన కూడా ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ దక్కించుకుంది. ఇక ఈ మూవీని మే 30న 4కే రీరిలీజ్‌లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. హైదరాబాద్ సిటీలో ఈ రీ రిలీజ్‌కి సంబంధించిన క్రేజ్ ఊహించిన దానికన్నా ఎక్కువగా కనిపిస్తుంది. ఈ మూవీ బుకింగ్స్ కొన్ని గంటల కిందట ఓపెన్ కాగా, ఈ చిత్రం ఇప్పటివరకు వచ్చిన తెలుగు రీ రిలీజ్ సినిమాల బుకింగ్స్ బ్రేక్ చేసింది. హైదరాబాద్ నగరంలో ఇప్పటివరకు విడుదలైన అన్ని రీ రిలీజ్ సినిమాల్లో ఖలేజా 4K అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా అత్యధిక గ్రాస్ వసూళ్లు సాధించింది. రిలీజ్‌కి మరో మూడు రోజుల సమయం ఉన్నా కూడా ఈ మూవీ సిటీలో రూ.1 కోటి గ్రాస్‌ను దాటి పోయింది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ కలెక్షన్స్ రిలీజ్ నాటికి మరింత పెరిగే అవకాశం ఉంది . ఇప్పటివరకు హైదరాబాద్‌లో 2025లో రీ రిలీజ్ అయిన సినిమాల్లో టాప్–5 అడ్వాన్స్ బుకింగ్స్ గ్రాస్ లిస్ట్ పరిశీలిస్తే.. మొదటి స్థానంలో ఖలేజా – రూ.1 కోటి తో ఉండగా రెండో స్థానంలో ఆర్య 2 - రూ.88 లక్షలు ఉంది. మూడో స్థానంలో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (SVSC) 4K – రూ.70 లక్షలు , నాలుగో స్థానంలో సలార్ – రూ.65 లక్షలు ,ఐదో స్థానంలో వర్షం 4K - రూ.47 లక్షలుగా ఉంది. ఈ లిస్ట్‌లో ఖలేజా టాప్‌లో నిలవడంతో ఈ సినిమా విడుదల రోజు మరిన్ని రికార్డులు క్రియేట్ చేసే అవకాశం ఉందని అంటున్నారు. సెకండ్ హ్యాండ్ జనరేషన్ ఖలేజాను థియేటర్లో చూడాలనుకుంటే మాత్రం మూవీకి భారీ కలెక్షన్స్ రావడం ఖాయం. త్రివిక్రమ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో అనుష్క కథానాయికగా నటించింది. సునీల్, ఆలీ తమ కామెడీతో ప్రేక్షకులని ఎంతగానో అలరించారు.

# అనుకున్నంత సైలెంట్ కాదు..

## ప్రభాస్‌పై మాళవిక మోహనన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



**తెలంగాణవీణ, సినిమా :**
పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌పై యువ నటి మాళవిక మోహనన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బయట కనిపించే ప్రభాస్ ఇమేజ్‌కు భిన్నంగా ఆయన వ్యక్తిత్వం ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'ది రాజా సాబ్' చిత్రంలో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ అనుభవాలను పంచుకుంటూ, ప్రభాస్ గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.మాళవిక మోహనన్ ఇటీవల సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటిస్తూ, ప్రభాస్‌తో తన అనుభవాలను పంచుకున్నారు. "నేను ప్రభాస్ సార్‌ను కలవడానికి ముందు ఆయన ఇంటర్వ్యూలు చూసినప్పుడు చాలా సైలెంట్‌గా, రిజర్వ్‌డ్‌గా ఉంటారని అనుకున్నాను. కానీ ఆయనను స్వయంగా కలిసినప్పుడు మంచి మాటకారి, సూపర్ ఫన్, ఫన్నీ అని అర్థమైంది" అని మాళవిక తెలిపారు. ప్రభాస్‌తో సమయం గడపడానికి చాలా చక్కని వ్యక్తులలో ఒకరని, ఆయన చుట్టూ ఎప్పుడూ బోరింగ్ క్షణమే ఉండదని ఆమె ప్రశంసించారు. ప్రభాస్ తన సహనటులను సెట్‌లో ఆహారంతో ఆకట్టుకుంటారని, ఒక గ్రామానికి సరిపడా రుచికరమైన భోజనాన్ని ఏర్పాటు చేస్తారని మాళవిక మోహనన్ గతంలోనూ వెల్లడించారు. ఇటీవల విడుదలైన 'కల్కి 2898 AD సినిమా విజయం తర్వాత కూడా ప్రభాస్ చాలా సింపుల్‌గా, డౌన్ టు ఎర్త్ గా ఉన్నారని ఆమె కొనియాడారు. మాళవిక చేసిన ఈ వ్యాఖ్యలు ప్రభాస్ అభిమానులను మరింత సంతోషపరుస్తున్నాయి. 'ది రాజా సాబ్' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభాస్, మాళవిక మోహనన్ ల కాంబినేషన్ ఈ సినిమాకు మరింత ఆకర్షణగా మారింది.

# అంకుల్స్ కూడా సలహాలిస్తున్నారు!

**తెలంగాణవీణ, సినిమా :**
కథానాయికగా మారి దాదాపు 20ఏండ్లు కావొస్తున్నా.. ఇప్పటికీ క్రేజీ హీరోయిన్ల జాబితాలోనే ఉన్నారు తమన్నా. ఆమె ఐటమ్ సాంగ్ చేస్తే.. ఆ పాట సినిమాకే హైప్ తెస్తున్నదని నిర్మాతలు నమ్ముతున్నారు. ఆమె వెబ్ సిరీస్ చేసినా దానికి ఎక్కడ లేని బజ్ క్రియేట్ అవుతున్నది. సినిమాల సంఖ్య తగ్గినా తమన్నా ఇమేజ్ ఇసుమంత కూడా తగ్గలేదనడానికి తార్కాణాలివే. దానికి తగ్గట్టే అభిమానులతో రెగ్యులర్‌గా టచ్‌లో ఉంటారు తమన్నా. రీసెంట్‌గా నిర్వహించిన చిట్ చాట్‌లో ఆమె వెల్లడించిన విషయాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. 'సినిమా ఇండస్ట్రీలోకి స్త్రీలు రావడం అంటే ఇప్పటికీ అదో పెద్ద విషయం. అదో నేరంగా భావించేవాళ్ల లిస్ట్ కూడా చాలా పెద్దదే. అంతెందుకు.. నేను నటిని అవ్వాలనుకుంటున్న విషయం ఇంట్లో చెప్పాను.ఆ విషయం ఎలాగో ఇరుగుపొరుగుకి తెలిసింది. అంతే.. నేను పెద్ద నేరం చేస్తున్నట్టుగా మాట్లాడటం మొదలుపెట్టారు. మా అమ్మానాన్నలకు సినిమా ఇండస్ట్రీ గురించి భయంకరంగా చెప్పారు. నా పేరెంట్స్ వాళ్ల మాటలు విన్నట్టయితే.. ఈ రోజు నటిగా నా కెరీర్ ఉండేది కాదు. వేధింపులు అన్ని రంగాల్లోనూ ఉంటాయి. అలాంటప్పుడు సినిమా ఇండస్ట్రీనే ఎందుకు భూతద్దంలో చూడటం?' అంటూ ప్రశ్నించారు తమన్నా. ఇంకా చెబుతూ 'ఈ మధ్య సోషల్ మీడియాలో ఆడవాళ్లు ఎలాంటి వస్త్రాలను ధరించాలో కొందరు అంకుల్స్ సలహాలిస్తుండటం చూస్తున్నా. అలాంటి వారికి నేను చెప్పేదొక్కటే.. ముందు మీ మానసిక పరిస్థితిని సరిచేసుకోండి. కావాలంటే మానసిక వైద్యులను కలవండి. అనవసరంగా విలువైన సమయాన్ని వృధా చేసుకోకండి' అంటూ చెప్పుకొచ్చారు తమన్నా భాటియా.





# 100వ సినిమా టైటిల్ అదేనా?

**తెలంగాణవీణ, సినిమా :**
ప్రస్తుతం నాగార్జున రెండు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. అందులో ఒకటి శేఖర్ కమ్ముల 'కుబేర' కాగా, రెండోది రజనీకాంత్ 'కూలి'. ఈ రెండు సినిమాల్లోనూ ఆయన ప్రత్యేక పాత్రలే పోషిస్తుండటం విశేషం. దానికి కారణాలు లేకపోలేదు. ధనుష్ హీరోగా నటిస్తున్న 'కుబేర'లో ప్రత్యేక పాత్ర చేయడానికి కారణం శేఖర్ కమ్ముల. ఆయన టేకింగ్ అంటే నాగ్‌కి ప్రత్యేకమైన అభిమానం. అలాగే పాత్రలోని కొత్తదనం నచ్చడంతో 'కుబేర'ని నాగ్ ఓకే చేశారు. ఇందులో ఆయన మిలియనీర్‌గా కనిపించబోతున్నారు. ఓ బెగ్గర్‌కీ, ఓ కోటీశ్వరుడికీ మధ్య జరిగే పోరాటంగా ఈ సినిమా ఉండబోతున్నదని కోలీవుడ్ టాక్.జూన్ 20న 'కుబేర' విడుదల కానుంది. ఇక నాగ్ నటిస్తున్న 'కూలీ' సినిమా విషయానికొస్తే.. ఈ సినిమాను కేవలం రజనీకాంత్‌పై ఉన్న అభిమానంతో చేస్తున్నారు నాగ్. అయితే.. 'కూలీ'లో నాగ్ పాత్ర అత్యంత శక్తివంతంగా ఉంటుందని తెలుస్తున్నది. ఆగస్ట్ 14న 'కూలీ'ని విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ రెండు సినిమాల తర్వాత నాగ్ తన 100వ చిత్రాన్ని పట్టాలెక్కిస్తారని సమాచారం. ఈ సినిమాకు పా.కార్తీక్ దర్శకత్వం వహిస్తారట. మరో విషయం ఏంటంటే.. ఈ సినిమాకి 'కింగ్ 100' అనే టైటిల్‌ని కూడా ఖరారు చేశారని తెలుస్తున్నది. అక్కినేని అభిమానులకు ఇది నిజంగా గుడ్‌న్యూసే.

# యువతరం ప్రేమకథ థాంక్యూ డియర్



**తెలంగాణవీణ, సినిమా :**యువ హీరో ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్ జంటగా నటించిన యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ 'థ్యాంక్యూ డియర్'. తోట శ్రీకాంత్‌కుమార్ దర్శకుడు. పప్పు బాలాజీరెడ్డి నిర్మాత. నిర్మాణంలో ఉన్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ లాంచింగ్ ఘనంగా జరిగింది. దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ ఈ ఫస్ట్‌లుక్‌ని లాంచ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. ఈ సినిమా తన కెరీర్‌కి చాలా కీలకమని, ప్రేక్షకులకు సినిమా తప్పక నచ్చుతుందనే నమ్మకంతో ఉన్నామని హీరో ధనుష్ రఘుముద్రి అన్నారు.హీరో ధనుష్‌కి సినిమా మంచి పేరు తెచ్చిపెడుతుందని నిర్మాత పప్పు బాలాజీరెడ్డి నమ్మకం వ్యక్తం చేశారు. యువతరం మెచ్చేలా సినిమా ఉంటుందని లైన్ ప్రొడ్యూసర్ పునీత్‌రెడ్డి తెలిపారు. రేఖా నిరోషా, వీరశంకర్, నాగ మహేశ్, రవిప్రకాష్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పి.ఎల్.కె.రెడ్డి, సంగీతం: సుభాష్ ఆనంద్.

Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written